సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 21 । డిసెంబర్ । 2024



సంక్రాంతి చుట్టాలకు బస్సులు రెడీ

సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చేవారిని జిల్లాకు తీసుకురావడానికి ఆర్టీసీ ఇప్పటి నుంచే సిద్ధమవుతుంది. అదనపు సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తోంది. 8లో



అలిగిన రొయ్య!

గత 15 రోజులుగా రొయ్యలు మేతలు తినక పోవడంతో ఎదుగుదల పడిపోయింది. ఎన్ని మందులు చల్లినా ఫలితం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు. 8లో



మామిడిలో సస్యరక్షణ తప్పనిసరి

మామిడి తోటలు పూమొగ్గ, పచ్చిపూత, పూత దశలో ఉన్నందున సస్యరక్షణ చర్యలను చేపట్టాలని మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

దళిత మహిళా సర్పంచ్‌పై దాడి



విలేకరులతో మాట్లాడుతున్న ఉండి సర్పంచ్ కమతం సౌజన్య

ఉండి: ఉండి పంచాయతీ దళిత మహిళా సర్పంచ్‌పై వార్డు సభ్యురాలి భర్త, మరికొందరు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం పంచాయతీ సమావేశంలో జరిగింది. ఉండి సర్పంచ్‌గా దళిత మహిళ కమతం సౌజన్య గెలుపొందగా, ఆమె భర్త కమతం బెనర్జీ వార్డు సభ్యుడిగా ఉన్నారు. కొంతకాలంగా పంచాయతీ సమావేశాలకు మహిళా వార్డు సభ్యుల స్థానంలో వారి భర్తలు హాజరవుతుండటంతో సర్పంచ్ అభ్యంతరం చెబుతున్నారు. శుక్రవారం సమావేశానికి 11వ వార్డు సభ్యురాలు కాగిత నాగమణి భర్త విజ్జు హాజరవడంతో సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సర్పంచ్‌పై విజ్జు దాడికి పాల్పడ్డాడు. తన భార్యను ఎందుకు కొట్టారని సర్పంచ్ భర్త ప్రశ్నించగా, ఆయనపై విజ్జు, మరో వార్డు సభ్యుడు అడబాల వరప్రసాద్ దాడి చేశారు. తాను దళిత సర్పంచ్ కావడంతోనే పలుమార్లు తనను అవమానపరిచారని, ఇప్పుడు ఏకంగా దాడి చేశారని మీడియా ఎదుట ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం సర్పంచ్, ఆమె భర్త భీమవరం ప్రభుత్వాస్పత్రిలో చేరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లి పాల బ్యాంకు ప్రారంభం



తల్లి పాల బ్యాంకును ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వ ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ సౌజన్యంతో సుశేణా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధాత్రి తల్లిపాల బ్యాంకు, బాలింతల నిర్వహణ కేంద్రాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో రాష్ట్రంలోనే రెండో తల్లిపాల బ్యాంకును ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. 6 నెలల పాటు కేవలం తల్లిపాలు ఇవ్వడం వల్ల సంవత్సరంలోపు పిల్లల మరణాలకు ప్రధాన కారణమైన నీళ్ళ విరేచనాలు, శ్వాసకోశ వ్యాధుల నుండి రక్షణ కలుగుతుందన్నారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ చైర్మన్ డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను గుర్తించి తమ సంస్థ సిఎస్ఆర్ తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు సహకరించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, ఆస్పత్రి సూపరిడెంట్ మాధవీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీడీఎస్ రైస్ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు చేపట్టామని, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు 22 ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేసి టమాటా, ఉల్లిపాయలు, పామాయిల్ హోల్ సేల్ ధరలకే అందిస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యావసరాల ధరల నియంత్రణకు ఇప్పటికే హోల్‌సేల్ అమ్మకందారులతో పలు దఫాలుగా సమావేశాలు ఏర్పాటు చేసి, ఉల్లిపాయలు, టమాట, పామాయిల్ వంటివి అందుబాటు ధరలలో ఉంచామన్నారు. తణుకులో హోల్ సేల్ ధరకే మినపప్పు అమ్మకం ప్రారంభించామని, త్వరలో జిల్లా అంతటా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం

నూజివీడు: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ట్రిపుల్ ఐటీలో శుక్రవారం మెగా జాబ్ మేళాను కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.





ముత్యాలపల్లి జెడ్పీ పాఠశాలలో డిజిటల్ బోర్డుపై విద్యాబోధన (ఫైల్)

దార్శనిక నేత విద్యాప్రదాత



ఆకివీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా విద్యాభ్యాసం సాగిస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ప్రపంచంతో విద్యార్థులు పోటీపడేలా ట్యాబుల పంపిణీకి శ్రీకారం
- గత రెండేళ్లలో 28,143 మందికి ట్యాబులు అందజేత
- అమ్మఒడిలో 1,48,342 మంది తల్లుల ఖాతాలకు రూ.887.9 కోట్ల జమ
- విద్యాదీవెన, వసతి దీవెనలతో ఉన్నత విద్యకు తోడ్పాటు
- నేడు విద్యారంగానికి 'చంద్ర'గ్రహణం

క్లాస్‌రూంలో టేబుల్‌పై ట్యాబ్‌లతో విద్యాభ్యాసం..

వైఎస్ జగన్ పాలనలో సర్కారు స్కూళ్లలో కనిపించిన దృశ్యమిది. కార్పొరేట్ స్కూళ్లలో కనిపించే ఈ విధానం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా, పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా నాలుగేళ్లలో వైఎస్ జగన్ కృషితో ప్రభుత్వ విద్యా విధానంలో వచ్చిన విప్లవాత్మక మార్పులకు అందరూ జోహార్లు పలికారు.

– సాక్షి, భీమవరం

పుట్టిన రోజున ట్యాబుల పంపిణీకి శ్రీకారం

ప్రపంచంతో పేద విద్యార్థులు పోటీపడేందుకు వీలుగా దృశ్య, శ్రవణ విద్య ద్వారా వారిలోని అభ్యసన సామర్థ్యం పెంపొందించేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. 2022 డిసెంబరు 21న తన పుట్టినరోజున 8వ తరగతి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ట్యాబుల పంపిణీ ప్రారంభించారు. జిల్లాలోని 14,353 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి బైజూస్ కంటెంట్‌తో కూడిన రూ.30 వేలు విలువ చేసే ట్యాబ్‌లు అందజేశారు. గత ఏడాది పుట్టినరోజున జిల్లాలోని 13,790 మందికి ట్యాబులు పంపిణీ చేశారు. తరగతి గదుల్లో డిజిటల్ విద్యాబోధన కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలు అందజేస్తూ వచ్చారు.



గత ఏడాది డిసెంబరు 21న ట్యాబ్‌లు అందజేస్తున్న నాటి కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

పోషకాల గోరుముద్ద

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలోను జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఆకర్షణీయ మెనూతో రోజుకో కొత్త రుచిని అందిస్తూ జగనన్న గోరుముద్ద పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ రైస్‌తో పాటు రాగిజావ, కోడిగుడ్డు, చిక్కీలతో విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించింది.

ఉన్నత విద్యకు భరోసా

ఆర్థికపరమైన ఇబ్బందులతో పేద విద్యార్థులు మధ్యలో ఉన్నత చదువులు మానేయకుండా జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాల ద్వారా వారికి అవసరమైన ఆర్థిక సాయాన్ని తల్లుల ఖాతాలకు జమచేస్తూ వచ్చారు. గత ఐదేళ్లలో జగనన్న విద్యాదీవెన పథకంలో 1,77,996 మంది విద్యార్థులకు రూ.485.33 కోట్ల సాయం అందించగా వసతి దీవెన పథకంలో 1,76,142 మంది విద్యార్థులకు రూ.163.41 కోట్లు అందించారు

డిజిటల్ తరగతులతో విద్యాబోధన భేష్



కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ తరగతులతో విద్యాబోధన భేష్. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలతో విద్యారంగానికి ఎంతో మేలు చేశారు. ట్యాబ్‌ల పంపిణీ, ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణ విద్యార్థుల మేథాశక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయి.

– దేగల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, మేడపాడు

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు




పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. డిజిటల్ విద్యాబోధన విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించిలా కొత్త ఆలోచనకు పునాదులు వేసింది. ట్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు ఆన్‌లైన్ విద్యాబోధనతో కొత్త ఒరవడి శుభపరిణామంగా చెప్పవచ్చు.

– ఎం.జోబాబు, ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకుడు, ఆకివీడు

సర్కారు స్కూళ్లకు కొత్త రూపు

పశ్చిమ గోదావరి జిల్లాలో 1,340 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 2019 నాటికి శిథిల భవనాలు, పెచ్చులు ఊడే పైకప్పులు, రాళ్లు పైకిలేచిన ఫ్లోరింగులు, కలుషిత తాగునీరు, దుర్గంధం వెదజల్లే టాయిలెట్లు, రక్షణ గోడలు లేక అసాంఘిక కార్యకలాపాలతో అధ్వాన స్థితికి చేరిన ప్రభుత్వ బడులకు నాటి సీఎం జగన్ కొత్త ఊపిరిలూదారు. 1,150 పాఠశాలల్లో రూ. 369.11 కోట్ల వ్యయంతో డిజిటల్ **క్లాస్‌రూంలు,** తాగునీటి వసతి, టాయిలెట్లు, **కిచెన్ షెడ్లు, ప్రహరీ** గోడలు, అదనపు తరగతి **గదుల నిర్మాణం,** విద్యుదీకరణ, మేజర్, మైనర్ **మరమ్మతులతో** కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా **ప్రభుత్వ** పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. **పిల్లల చదువులకు** పేదరికం అడ్డుకాకూడదన్న **సంకల్పంతో** అమ్మఒడి పథకాన్ని అమలుచేశారు. **గత ఐదేళ్లలో** జిల్లాలోని 1,48,342 మంది **తల్లుల ఖాతాలకు** రూ.887.9 కోట్లు జమచేశారు.



పేదల విద్యకు 'చంద్ర'గ్రహణం

తల్లికి వందనం పథకం కింద ఇంట్లో పాఠశాల విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికి రూ.15,000 చొప్పున సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చెప్పిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లాలో 1,74,763 మంది విద్యార్థులకు ఈ ఏడాది రూ.15,000 చొప్పున రూ.262 కోట్లు సాయం అందించాల్సి ఉంటుందని అంచనా. మరో నాలుగు నెలల్లో విద్యాసంవత్సరం ముగియనుండగా ఎప్పుడిచ్చేది సీఎం, డిప్యూటీ సీఎంలు నోరు మెదపక పోవడం గమనార్హం. విద్యార్థులకు ట్యాబుల పంపిణీ ఊసెత్తడం లేదు. మరో పక్క పాత బకాయిలు, ప్రస్తుత విద్యాసంవత్సరానికి 31,412 మంది విద్యార్థులకు సంబంధించి రూ.138.8 కోట్ల విద్య, వసతి దీవెన పథకాల బకాయిలు ఉన్నాయి.

40 మందికి పదోన్నతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని వివిధ పురపాలక యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శుక్రవారం రాత్రి దాదాపు 10.30 గంటల వరకూ కొనసాగింది. ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 40 మందికి పదోన్నతులు కల్పిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులిచ్చారు. ఏలూరు నగర పాలక సంస్థలో ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. సెకండరీ గ్రేడ్ టీచర్లలో బయోలాజికల్ సైన్స్ ఒకరికి, ఇంగ్లీష్ ఒకరికి, గణితం ఒకరికి, సోషల్ ఇద్దరికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. మున్సిపల్ యాజమాన్యాల్లోని నలుగురికి గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులుగా, మరో ముగ్గురికి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. వీరితో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తున్న వారిలో ఫిజికల్ సైన్స్ నలుగురికి, సోషల్ 8 మందికి, బయోలాజికల్ సైన్స్ ఐదుగురికి, ఇంగ్లీష్ ముగ్గురుకి, గణితంలో ఐదుగురికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు.



ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు

మెరుగైన వైద్య సేవలందించాలి

సాక్షి ఎఫెక్ట్

భీమవరం(ప్రకాశం చౌక్) : పేదవారికి మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు పని చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ఏరియా ఆస్పత్రిలోని పలు విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి వార్డులో ఆపరేషన్ చేయించుకున్న బాలింతలతో ఆయన మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం ఆహార అందిస్తున్నారా? వైద్య సేవలపై ఆరాతీశారు. 'అరకొర వైద్యంతో అవస్థలు' శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జేసీ స్పందించి ఆస్పత్రిలో అందుతున్న వసతులు తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులు తప్పనిసరిగా రెండు పూటల ఆస్పత్రిలో ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చేవారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని, నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): నిబంధనలు మీరి డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రహదారుల భద్రత సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రోడ్డు భద్రతా చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని.. అందువల్లే ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించామన్నారు. యువత వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీసు, రవాణా శాఖలు పెద్ద ఎత్తున వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మావుళ్ళమ్మ గుడి ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడేపల్లిగూడెం బైపాస్ పత్తిపాడు వద్ద జాతీయ రహదారి నుంచి ఎదురుగా వాహనాలు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, బారికేడ్లు వేసినా ఉంచడం లేదని పోలీసులు సభ దృష్టికి తీసుకురాగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్ వంటి వాటిపై చర్యలు తప్పని హెచ్చరించారు. సమావేశంలో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, నరసాపురం ఆర్డీవో దాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

దొంగ బంగారానికి దొడ్డిదారి

- 'గూడెం బంగారం' లోగుట్టు బట్టబయలు
- వ్యాపారి పరారీతో గత ఉదంతాలు గుర్తుచేసుకుంటున్న జనం



తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో భారీగా బంగారం, వెండి, వజ్రాలతో జ్యూయలరీ షాపు యజమాని పరారు కావడంతో పట్టణంలోని బులియన్ మార్కెట్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిందితుడి కోసం పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి వేట కొనసాగిస్తున్నారు. గూడెంలో గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. దొంగ బంగారం కొనడం, నకిలీ బంగారం తయారు చేయించడం వంటివి ఎన్నో.. దొంగ బంగారం వచ్చిన వెంటనే కరిగించే ఏర్పాట్లు కూడా ఉండేవి. బిల్లులేని వ్యాపారం, ఎస్టిమేటు కాపీలతో ఆభరణాల తయారీ, తప్పుడు పనులు చేసే వారికి గూడెం రాచమార్గంగా కనిపించింది. తాజాగా బంగారు టోకరా ఉదంతం ఇక్కడ బంగారం వ్యాపారంలోని లొసుగులను బట్టబయలు చేసింది.

మూడు బిస్కెట్లు.. ఆరు లాకెట్లు

గూడెంలో దొడ్డి దారిన బంగారం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగేది. అమాంతంగా కోటీశ్వరులు కావాలనే ఆశలతో దొంగ బంగారం కొని సొమ్ము చేసుకునేవారు. ఏడాదికి ఒకటిలేదా రెండు కేసులు పోలీసులకు చెబితే చాలనే భావన పెంచుకున్నారు. అదే ఫార్ములాతో కొన్నేళ్ల పాటు వ్యాపారం సాగించారు. వీరి బాగోతం తణుకులోని ఒక నగల దుకాణంలో జరిగిన చోరీతో బహిర్గతమైంది. తణుకులోని నరేంద్ర సెంటర్‌లో ఉన్న జడావి జ్యూయలర్స్‌లో భారీ చోరీ జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి చేధించే క్రమంలో పోయిన నగలను తాడేపల్లిగూడెంలోని టూటౌన్‌కు చెందిన వ్యాపారి ఒకరు కొన్నట్లు గుర్తించారు. బంగారు దుకాణంలో విక్రయించే ఆభరణాల వెనుక ట్రేడ్ మార్కు గుర్తు ఉంటుంది. ఆ గుర్తులను బట్టి దొంగిలించిన నగలు గూడెం దుకాణదారుడు కొన్నట్టుగా పోలీసులకు నిర్ధారణకు వచ్చారు. ఆ తర్వాత అరెస్టు చేసి ప్రశ్నించగా.. గూడెం వ్యాపారి నేరాన్ని అంగీకరించాడు. ఇది జరిగిన కొంతకాలం తర్వాత ఒక వ్యాపారి ప్రోద్బలంతో టూటౌన్‌లో మోడరన్ కేఫ్ దాటాక బంగారు దుకాణంలో చోరీకి ఏకంగా సొరంగం తవ్వి ఆనక పోలీసులకు దొరికిపోయారు. 2001 సంవత్సరంలో దొంగబంగారు వ్యాపారం గూడెంలో మూడు బిస్కెట్లు, ఆరు లాకెట్లుగా సాగింది. దొంగ మార్గంలో బంగారం, ఆభరణాలు కొనుగోలు చేసిన కొందరు వ్యాపారులు ఇళ్ల దగ్గర సెటప్ చేసుకున్న ఊక పొయ్యల్లో కరిగించే ఏర్పాట్లు ఉండేవి.

వెండి వస్తువులపై బంగారు పూతతో మోసం

గతంలో ఒక వ్యాపారి బంగ్లాదేశ్ నుంచి బంగారు ఆభరణాలు తయారుచేయడానికి వచ్చిన వారితో నాసిరకం బంగారం వస్తువులు తయారు చేయించేవాడు. వెండి వస్తువులపై రాగి కోటింగ్, దానిపై బంగారు పూత వేయించి విక్రయించేవాడు. ఇలా వస్తువులు తయారు చేయడానికి పనివారికి అడ్వాన్సులుగా పెద్ద మొత్తంలో సొమ్ములు ఇచ్చేవారు. సొమ్ములు సకాలంలో చెల్లించకపోయినా, వస్తువులను సకాలానికి అందించక పోయినా వివిధ శిక్షలు వేసే వారు. రాత్రిపూట వివస్త్రల్ని చేయించి, సిగరెట్ వాతలు పెట్టేవారు. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు కూడా అందాయి.

క్లుప్తంగా

రేపు విక్టరీ 3కే రన్

పెంటపాడు: మండలంలోని అలంపురం టీబీఆర్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం విక్టరీ 3కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బోగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పోరాడిన 20 మంది యుద్ధవీరులను ఎంపిక చేసి సన్మానిస్తామని పేర్కొన్నారు. అలాగే నేషనల్‌డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు మూడు కేటగరీల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. ప్రథమ బహుమతి సాధించిన 10 మందికి ఉచితంగా విద్య అందిస్తామని పేర్కొన్నారు. అలాగే మొదటి 50 మందికి రాయితీతో కూడిన విద్యను అందిస్తామని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శివగణేష్ (28)

భీమడోలు: కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన నాళం శివగణేష్ (28) చికిత్స పొందుతూ మృతి చెందాడని భీమడోలు హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన నాళం శివగణేష్(28) భీమడోలు లిక్సిల్ సెరామిక్ కంపెనీలో టీం లీడర్‌గా పని చేస్తూ భీమడోలులో భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 1న శివగణేష్ ఇంటి వద్దనే మద్యం తాగుతుండడంతో భార్య లక్ష్మీ ప్రసన్న మద్యం తాగవద్దని, ఆరోగ్యం పాడైవుతుందని మందలించింది. మనస్తాపం చెందిన శివగణేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లి కొద్ది సేపటి తర్వాత వచ్చి కలుపు మందు తాగానని చెప్పడంతో భార్య లక్ష్మీ ప్రసన్న భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రికి భర్తను తీసుకుని వచ్చింది. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం శివగణేష్‌ను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివగణేష్ మృతి చెందాడు. భార్య లక్ష్మీ ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

యలమంచిలి: కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రు గ్రామానికి చెందిన చెల్లింకుల వాణి శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపిన వివరాల ప్రకారం వాణికి 2021 సంవత్సరంలో పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్లవానిగరువుకు చెందిన పాండురంగప్రసాద్‌తో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు పుట్టిన తరువాత ప్రసాద్ కట్నం కోసం భార్యను వేధించడం ప్రారంభించాడు. దీంతో వేధింపులను తట్టుకోలేక వాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.


ఆరబెట్టిన ధాన్యపు రాశులపై టార్పాలిన్ కప్పి ఉంచిన దృశ్యం


అత్తిలిలో ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

అన్నదాతకు వాయుగండం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల చిరుజల్లులు పడడంతో శుక్రవారం రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు రక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. అత్తిలి మండలంలో దాదాపుగా నూరు శాతం వరికోతలు పూర్తయ్యాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు రోడ్ల వెంబడి రాశులు పోసి ఆరబెట్టగా ఆకాశం మేఘావృతం కావడంతో వాటిని పోగు చేసి టార్పాలిన్‌లు కప్పారు. తేమ శాతం ఉన్నప్పటికీ కొంతమంది రైతులు ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకుందామని రైస్ మిల్లులకు తరలించారు.


– అత్తిలి

సాయం సంధ్యవేళ కనువిందు

వాయుగుండ ప్రభావంతో ఏలూరులో గత మూడు రోజుల నుంచి ఎండ లేకుండా మబ్బులే దర్శనమిస్తున్నాయి. శుక్రవారం మబ్బులతో ఆకాశం నిండి ఉంది. పడమర దిక్కున మాత్రం మబ్బున మాటున సూర్యకిరణాలు ఇలా దర్శనమిచ్చాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు


ఆకాశంలో దట్టంగా కమ్మిన మబ్బులు


పడమర దిక్కున సాయంత్రం వేళ సందడి చేసిన సూర్య కిరణాలు

సంక్రాంతి చుట్టాలకు బస్సులు రెడీ

- టిక్కెట్ ధరల పెంపు లేకుండానే హైదరాబాద్ నుంచి ప్రత్యేక సర్వీసులు
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏడు డిపోల నుంచి సేవలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్రాంతి పండుగంటే గోదావరి జిల్లాల్లో సందడి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతి ఇంట్లో పిండి వంట ఘుమఘుమలతో పాటు పంట చేతికందగానే రైతులు చేసే రైతు పండుగ కాబట్టి గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొని ఉంటుంది. ముఖ్యంగా కోడి పందేలకు ఉమ్మడి పశ్చిమ పెట్టింది పేరు. కాబట్టి సొంతూళ్లకు దూరంగా ఉన్న వారు కచ్చితంగా సంక్రాంతికి సొంతింటికి చేరుకుని ఉల్లాసంగా పండుగ జరుపుకుంటారు. జిల్లాకు చెందిన ప్రజల్లో ఎక్కువ మంది ప్రజలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ రంగం, వ్యాపార రంగాల్లో స్థిరపడడంతో అక్కడి నుంచే జిల్లాకు వచ్చే జనాభా వేలల్లో ఉంటారు. వారందరినీ జిల్లాకు తీసుకురావడానికి ఆర్టీసీ ఇప్పటి నుంచే సిద్ధం అవుతుంది.

ప్రత్యేక సర్వీసులు ఇలా

పండుగ నిమిత్తం హైదరాబాద్ నుంచి జిల్లా ప్రజలను తీసుకురావడానికి, పండుగ అనంతరం వారిని తిరిగి గమ్య స్థానాలకు చేర్చడానికి ఉమ్మడి పశ్చిమ ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తుంది. వీటిలో ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి జనవరి 9 నుంచి హైదరాబాద్ నుంచి తీసుకురావడానికి, 15 నుంచి హైదరాబాద్‌కు తరలించడానికి మొత్తం 93 బస్సులను ఇప్పటికే ఆన్‌లైన్ రిజర్వేషన్ ప్రక్రియ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లి గూడెం, తణుకు, నరసాపురం డిపోల నుంచి మొత్తంగా ప్రతి నిత్యం 20 ప్రత్యేక సర్వీసులను అందుబాటులో ఉంచారు. ఇవి కాక ఏలూరు జిల్లా నుంచి ఏడాది పొడవునా ప్రతి రోజూ తిరిగే రెగ్యులర్ షెడ్యూల్ బస్సులతో పాటు మరో 29 అందుబాటులో ఉంటాయి. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తిరిగే 20 రెగ్యులర్ షెడ్యూల్ బస్సులు కూడా ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి.



సాధారణ టిక్కెట్ ధరలే వసూలు

గతంలో పండుగల నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే సర్వీసుల్లో ప్రయాణికుల నుంచి 50 శాతం అధికంగా టిక్కెట్ ధరలు వసూలు చేసేవారు. దీంతో ప్రయాణికులు తమకు అందుబాటులో ఉన్న వాహనాల్లో అంటే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, ట్యాక్సీలు, రైళ్లు తదితర వాహనాల్లో వెళ్లేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేవారు. దీనిపై సర్వత్రా వచ్చిన విమర్శలు రావడం, ఆర్టీసీ ఆదాయానికి గణనీయంగా గండి పడిన నేపథ్యంలో గత ఏడెనిమిదేళ్ల నుంచి సాధారణ టిక్కెట్ ధరలతో ప్రత్యేక సర్వీసులను ఆర్టీసీ నడుపుతుంది.

గతేడాది సంక్రాంతి ఆదాయం రూ. 1.29 కోట్లు

గతేడాది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 7 డిపోల నుంచి నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా ఆర్టీసీ రూ. 1.29 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోగలిగింది. దీంట్లో ఏలూరు జిల్లా నుంచి మొత్తం 307 ప్రత్యేక బస్సులను తిప్పారు. వాటిలో 144 హైదరాబాద్ నుంచి జిల్లాకు, 163 జిల్లా నుంచి హైదరాబాద్‌కు తిప్పారు. వీటి ద్వారా మొత్తం 15590 మంది ప్రయాణం చేయగా 76,36,712 ఆదాయం వచ్చింది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలోని 4 డిపోల నుంచి హైదరాబాద్ నుంచి జిల్లాకు 88 బస్సులు, జిల్లా నుంచి హైదరాబాద్‌కు 104 బస్సులు తిప్పారు. దీని ద్వారా మొత్తం 6 వేల మంది ప్రయాణించగా రూ. 53,16000 ఆదాయం వచ్చింది.

పది శాతం రాయితీ..



హైదరాబాద్ నుంచి జిల్లాకు, జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఒకేసారి రానుపోనూ టిక్కెట్లు రిజర్వ్ చేసుకుంటే టిక్కెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నాం. హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల ప్రజలకు ఇప్పటి నుంచే రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉంది. సూపర్ లగ్జరీ బస్సులతో పాటు అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులో ఉంచాం. డిమాండ్ ఎక్కువగా ఉంటే మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తాం.

– ఎన్‌వీఆర్ వర ప్రసాద్, ఏలూరు జిల్లా ఇన్‌చార్జ్ ప్రజా రవాణా అధికారి

సామాజిక అసమానతలతో ఓబీసీలకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

భీమవరం: దశాబ్దాల తరబడి దేశం గర్వపడే స్థాయిలో తమ వంతు పాత్ర పోషించినప్పటికి ఓబీసీలకు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదని, అధికార పాలక వర్గాలు ఓబీసీలను వెనుకబాటుతనంలోకి నెట్టివేస్తుందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. భీమవరం టౌన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓబీసీల స్థితిగతులు మెరుగుపడాలంటే కులగణనే పరిష్కార మార్గమని, 2010లో బీజేపీ ప్రతిపక్ష పార్టీ హోదాలో లోక సభలో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతామని, అధికారానికి వచ్చారు కానీ ఓబీసీ జనగణన చేపడతారన్న నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలని, బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంత్ రావు, జిల్లా నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్, గుడాల శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వర రావు, మల్లుల కేదరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

నూజివీడు: ప్రస్తుతం మామిడి తోటలు పూమొగ్గ దశ, పచ్చిపూత దశ, పూత దశలో ఉన్న దృష్ట్యా ప్రస్తుత ముసుగు వాతావరణ పరిస్థితులలో రైతులు సస్యరక్షణ చర్యలను చేపట్టాలని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి వెల్లడించారు. ప్రస్తుతం నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని, అలాగే అల్పపీడనం వల్ల అత్యల్ప ఉష్ణోగ్రతలు 22.4 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 25.1 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదవుతున్నాయన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల మామిడిలో రసం పీల్చే పురుగుల ఉధృతి, తెగుళ్ల ఉధృతి అధికమయ్యే ప్రమాదం ఉందన్నారు. మామిడి తోటలు పూమొగ్గ దశలో ఉంటే తేనె మంచు పురుగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, క్లోరోథలోనిల్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడి తోట పచ్చిపూత దశలో ఉంటే తేనె మంచు పురుగు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు థయామిథాక్సమ్ 0.3 గ్రా లేదా బుప్రోఫెజిన్ 1.5 మి.లీ, హెక్సాకోనజోల్ 2 మి.లీ లేదా కార్బండజిమ్స్+ మాంకోజెబ్ కలిపి 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం తోటకు నీరు అందించడం నిలిపి వేయాలని, తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.


నూజివీడు మండలం కొత్త రావిచర్లలో పూత కనిపిస్తున్న మామిడి తోట


బొర్రా కనకమహాలక్ష్మి

రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక ఏలూరు రోడ్‌లో షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ షోరూమ్‌ను యజమాని కానూరి శ్రీనివాసరావు, ఆయన కుమారుడు యశ్వంత్, శ్రీనివాసరావు తల్లి సత్యనారాయణమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, రామ్‌రాజ్ కాటన్ జీఎం శోంద్రన్ నాయక్, కానూరి సూర్యకుమారి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేయగా, కౌంటర్‌ను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండవల్లి సోంబాబు ప్రారంభించి, కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ జీఎం శోంద్రన్ నాయక్ మాట్లాడుతూ తమ వద్ద రామ్‌రాజ్ ప్రోడక్ట్స్ అనగా పట్టు పెంచెలు, కండువాలు, చీరలు, రెడీమేడ్ షర్ట్స్, ఫ్యాంట్స్, జెంట్స్ క్లాత్ షాంటింగ్, షర్టింగ్ అన్నీ రామ్‌రాజ్ బ్రాండ్‌లో లభిస్తాయని తెలిపారు. షోరూమ్ యజమాని కానూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మా సొంత వ్యాపారంలో అనుభవం ఉన్న ప్రావీణ్యంతో చక్కగా అందరికీ సరసమైన ధరలలో అందరికీ కావాల్సిన దుస్తులను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అందరూ విచ్చేసి మాధవి క్లాత్ అండ్ రెడీమేడ్స్ షోరూమ్‌కు అందించినట్లుగానే, తమ రామ్‌రాజ్ షోరూమ్ వ్యాపార అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.


జంగారెడ్డిగూడెంలో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభిస్తున్న దృశ్యం

నన్నయ యూనివర్సిటీ మహిళా వాలీబాల్ జట్టు ఎంపిక


మహిళా వాలీబాల్ క్రీడాకారిణులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరఫున అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో తలపడే జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో గురువారం, శుక్రవారం నిర్వహించిన అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారిణులను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. కాగా ఈ పోటీల్లో జంగారెడ్డిగూడేనికి చెందిన సీఎస్‌టీఎస్ ప్రభుత్వ కళాశాల జట్టు విజేతగా నిలువగా గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ జట్టు ద్వితీయ స్థానంలో, ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. యూనివర్సిటీ జట్టు తరఫున ఆడే జట్టుకు కె.జయశ్రీ, యూఎస్‌డీ భవాని, వి.ఉషా నాగబాల, టి.రోహిణి, సీహెచ్ పల్లవి, పి.రమ్య, జి.జయశ్రీ, ఎల్.జ్యోతిలక్ష్మి, టి.శైలజ, జి.ప్రసన్న జ్యోతి, ఎం.నాగ తులసి, డి.మల్లేశ్వరి ఎంపికయ్యారు. వీరితో పాటు స్టాండ్ బై క్రీడాకారిణులుగా ఎం.లావణ్య, బి.అనిత, సీహెచ్ శోభారాణి, వి. ప్రవల్లికలను ఎంపిక చేశారు. ఈ జట్టు జనవరి 7 నుంచి 11వ తేదీవరకూ తమిళనాడులోని జెప్పియర్ యూనివర్సిటీలో నిర్వహించే దక్షిణ భారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలో నన్నయ యూనివర్సిటీ తరఫున పాల్గొంటారు. అంతకు ముందు జరిగిన పోటీల్లో విజేతలకు సీఆర్‌ఆర్ మహిళా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ జీ. సరళ బహుమతులు అందజేశారు.

పశువధపై చర్యలు తీసుకోవాలి

భీమవరం(ప్రకాశం చౌక్): తణుకు మండలం తేతలి గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న పశువధశాలలో ప్రతిరోజూ వందలాది పాడి పశువులను వధిస్తున్నారని రామరాజ్యం సంస్థ వ్యవస్థాపకుడు వీరరాఘవరెడ్డి ఆరోపించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌కు అక్రమ పశువధశాల బాధితులతో వచ్చి అక్రమ పశువధపై చర్యలు తీసుకోవాలని అందుబాటులో ఉన్న వన్‌టౌన్ ఎస్సై కిరణ్‌కు వినతిపత్రం అందించారు. పశువధ విషయాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, కాబట్టి కలెక్టర్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలిగిన రొయ్య!

- మేత తినకపోవడంతో మందగించిన ఎదుగుదల
- లబోదిబోమంటున్న ఆక్వా రైతులు


రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు


పట్టుబడి చేసిన రొయ్యలు

ఆకివీడు: రొయ్య.. అలిగింది.. ఇదేంటి అని అనుకుంటున్నారా? ఇది అక్షర సత్యం. గత 15 రోజులుగా రొయ్యలు మేతలు తినక పోవడంతో ఎదుగుదల పడిపోయింది. ఎన్ని మందులు చల్లినా ఫలితం దక్కడం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రొయ్యల సాగుకు ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలిగాలికి తోడు మబ్బులు, చిరుజల్లులతో వాతావరణంలో తేమ శాతం పెరిగిపోయింది. దీంతో రొయ్యలకు సక్రమంగా ఆక్సిజన్ అందడం లేదు. ప్రతి క్షణం ఏరియేటర్లు తిరుగుతున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రత 23 డిగ్రీలకు పడిపోయింది. ఒక్కోసారి 18–20 డిగ్రీలకు పడిపోతుంది. చల్లటి వాతావరణంలో రొయ్యలు ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. ఆక్సిజన్ అందకపోవడంతో రొయ్యలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నెలా పదిహేను రోజుల నుంచి పెంపకం కొనసాగుతున్నా రొయ్యల్లో ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. మేతలు వృథాగా మట్టిలో కలిసిపోతున్నాయి. 200 నుంచి 150 కౌంటులో ఉన్న రొయ్యలకు వైరస్ సోకితే పట్టేయాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన రొయ్య ధర

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రొయ్యల వ్యాపారులు ధరలను ఒక్కసారిగా తగ్గించివేశారని రైతులు వాపోతున్నారు. రొయ్యల్లో ఎదుగుదల లేకపోవడం, వైరస్ సోకడంతో 100 కౌంట్ ధర రూ.265 నుంచి రూ.250లకు పడిపోయిందంటున్నారు. దళారుల బెడదతో ధరలు తగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు, దళారులు ఇష్టానుసారం ధరలు తగ్గిస్తూ, పెంచుతూ నిలకడ లేకుండా రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న పెట్టుబడి



రొయ్యల సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. శీతాకాలం దానికి తోడు వాయుగుండ ప్రభావంతో చెరువుల్లో ఆక్సిజన్ పడిపోతుంది. ఏరియేటర్లు తిప్పినా ఫలితం ఉండటం లేదు.

– ఇంటి ప్రేమానందం, ఆక్వా రైతు, చినమిల్లిపాడు

రొయ్యలు మేత తినడం లేదు



ప్రస్తుత రొయ్యల సాగు తుఫాన్, వాయుగుండం ప్రభావాలకు గురై అతలాకుతలమవుతుంది. చలిగాలులతో పాటు తెలిక పాటు జల్లుల వల్ల రొయ్యకు ఆక్సిజన్ అందడం లేదు. ఎదుగుదల లేక, వైరస్‌లతో సతమతమవుతున్నాం. దీంతో పెట్టుబడులు అధికమై, ధర లేక కుదేలవుతున్నాం.

– నంద్యాల సీతారామయ్య, ఆక్వా రైతు, కుప్పనపూడి

సిండికేట్‌గా వ్యాపారులు



వాతావరణం మార్పులతో రొయ్యలు రోగాలబారిన పడుతున్నాయి. ఇమ్యూనిటీ తగ్గిపోయి వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది. అలాగే రొయ్య ధరలు తటస్థంగా ఉండటంలేదు. వ్యాపారులు సిండికేట్‌గా తయారై ధరలు నిర్ణయిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. విద్యుత్ సబ్సిడీ అమలు చేయాలి.

– పిల్లా నర్సింహరావు, ఆక్వా రైతు, ఆకివీడు

క్లుప్తంగా

నేడు జగన్ జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేసి జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, మిఠాయిలు పంచి, పడాల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని మాజీ మంత్రి కొట్టు పిలుపునిచ్చారు.

తాడేపల్లిగూడెం (టీటీసీ): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు వడ్డీ రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

పెంటపాడు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని భీమడోలులో ఈనెల 21వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో పార్టీ శ్రేణులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



వార్డుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): మురుకు కాలువల్లో వ్యర్థాలు వేయకూడదని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని శుక్రవారం 33, 34, 35 వార్డులలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలు జరిగాయి. వార్డులలో ఇంటింటికి హెల్త్ సిబ్బందిచే క్షేత్రస్థాయి పరిశీలనలు జరిగాయి. ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, ఆశాలు శ్వాతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు



భవిత సెంటర్ వద్ద ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): అంతర్జాతీయ దివ్యాంగుల మాసోత్సవాలు సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగుల పిల్లలకు పరుగుపందెం, క్యారం బోర్డు, త్రోబాల్, క్రికెట్, క్రీడలను ఆడించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ విజేతలకు బీవీఆర్ కళాకేంద్రంలో జరిగే సమావేశంలో ప్రజా ప్రతినిధులతో, అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. సంఘం నాయకులు కొత్త వీర్రాజు, పులిమి లక్ష్మణరావు, మేడపాటి వీర వెంకట రాఘవేంద్రరెడ్డి, ఆమంచి నాని, తానికొండ బాలాజీ, అవ్వపాటి సత్యభాను, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న రామకృష్ణ తదితరులు

తణుకు అర్బన్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డా.బిఆర్ అంబేడ్కర్‌ని పార్లమెంట్‌లో ఎగతాళి చేసి మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామకృష్ణ తెలిపారు. తణుకు ఎన్టీఆర్ పార్కు ప్రాంతంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అంబేద్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే అమిత్‌షాను బర్తరఫ్ చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు మండల అధ్యక్షుడు రుద్రా అన్నవరం, అన్నెపు శ్రీను, మాజీ కౌన్సిలర్ దిర్సిపో శాంతారావు, నాయకులు పాల్గొన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు

- మరమ్మతులతో సరిపెట్టేశారు
- పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో స్థానికుల ఆవేదన





ప్రత్తిపాడు- అలంపురం రోడ్డుకు జరుగుతున్న మరమ్మతులు

పెంటపాడు: మండలంలో రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడికక్కడ గోతులమయంగా మారడం, రాళ్లు పైకి లేచి ఉండడంతో నానా అవస్థలు పడుతున్నారు. అధ్వానంగా ఉన్న ప్రత్తిపాడు రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్లే రోడ్డు కూడా శిథిలం కావడంతో కనీసం ద్విచక్రవాహనాలపై కూడా ప్రయాణం చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. అదేవిధంగా గూడెం పట్టణంలో నుంచి తణుకు వేళ్లే రహదారి అస్తవ్యస్థంగా మారింది. ఈ రహదారులకు కనీస మరమ్మతులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తూతూ మంత్రంగా చేపట్టిన మరమ్మతు పనులతో ఉపయోగం లేదంటున్నారు. ప్రధానంగా బాదంపూడి వద్ద జాతీయ రహదారి దిగిన చోట నుంచి మళ్లీ సాక్షి కార్యాలయం ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి ఎక్కే వరకు ప్యాచ్ వర్కు చేసినా, జువ్వలపాలెం వద్ద పాత రోడ్డులానే ఉంది. ప్రత్తిపాడు నుంచి అలంపురం మీదుగా జాతీయ రహదారి వెళ్లే రోడ్డు దుస్థితి కూడా అలానే ఉంది. పెంటపాడు- విప్పర్రు రహదారి గోతులు కూడా పూడ్చలేదు. ఇక గ్రామీణ రహదారులు కూడా అలానే ఉన్నాయి.

గోతుల మయం

గూడెం నియోజకవర్గంలో ప్రధానంగా స్థానికులతో పాటు, ఇతర ప్రాంత ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే ప్రత్తిపాడు- బాదంపూడి నిర్మించి దాదాపు పుష్కరకాలం పైనే గడుస్తుంది. అప్పటి నుంచి మరమ్మతులు లేవు. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు సమకూర్చింది. టెండర్లు ఖరారయ్యాయి. ఈ లోగా ఎన్నికల కోడ్ వచ్చింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం గోతులతో ప్రయాణానికి వీలు లేకుండా మారింది. ఈ రోడ్డును పునః నిర్మించాలని వెడల్పు చేయాలని గతంలో ప్రజలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే రెండు నెలలుగా గోతులు పూడ్చుతున్నారు. కానీ స్థితిమాత్రం మారలేదు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మిస్తే కొన్నాళ్లపాటు వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా గూడెం పట్టణంలో ఈ రహదారితో పాటు, పెంటపాడు మండలంలో విప్పర్రు రహదార్లు ఎంతో కీలకమైనవి. ఈ రహదారులలో నిత్యం వేలాదివాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పండుగల సమయంలో మరింత రద్దీ పెరిగింది. నిత్యం పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారి సంఖ్య పెరిగింది. తక్షణం ప్యాచ్ వర్కులు కూడా ఎత్తు.. పల్లం లేకుండా నాణ్యతతో వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం

దాదాపు ఎనిమిది ఏళ్ల నుంచి ప్రత్తిపాడు- బాదపూడి రహదారి వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డును మళ్లీ వేస్తారంటే సంబరపడ్డాం. కానీ మరమ్మతులు మాత్రమే చేస్తున్నారు. ఎన్నాళ్లు ఉంటాయో తెలియదు. ఈ రోడ్డును తక్షణం నిర్మిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దూరప్రాంత బస్సులు హైవే మీద నుంచి కాక పట్టణంలోకి వస్తాయి. దూర ప్రయాణాలు చేసేవారికి ఎంతో ఉపయోగం.

– దాట్ల రామలింగరాజు, పెంటపాడు మండలం

ట్రాఫిక్ లేకుండా చూడాలి

రహదారులు పూర్తిస్థాయిలో వేయకపోవడం వల్ల తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. దీనివల్ల విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అత్తిలి- అలంపురం రహదారిని నిర్మించాలి. మరమ్మతుల్లో నాణ్యతతో లేవు. వాటివల్ల ఉపయోగం ఉండటం లేదు.

– దేవరశెట్టి రాంబాబు, కొండేపాడు రైతు

ఇంధన పొదుపు పాటించాలి



తణుకు విద్యుత్ శాఖలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈఈ శ్రీనివాస్ తదితరులు

తణుకు అర్బన్: భవిష్యత్తు తరాలకు ఇంధన వనరులు సమృద్ధిగా అందాలంటే నేడు ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని విద్యుత్ శాఖ డీఈఈ పి.శ్రీనివాస్ అన్నారు. తణుకు విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈనెల 14వనుంచి నిర్వహించిన వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయని చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు డి.సాధిక్, ఎం.జాన్సన్, ఎస్పీ రమణమూర్తి, ఉద్యోగులు ఎ.బాలకృష్ణ, కె.సతీష్, పి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎల్ఎల్ఎంలో యూత్ క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: గూడెం బాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం విమోచన మందిరంలో శనివారం సాయంత్రం ఎల్ఎల్ఎం హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు యూత్ లీడర్ ఎస్. చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మీఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ బ్రదర్ హిజ్కియా కింగ్ కోడ్‌తో పాటు, పాస్టర్ల సంఘ రాష్ట్ర నాయకులు మల్లిపూడి జైబాబులు క్రిస్మస్ సందేశం అందిస్తారన్నారు. పరిసర గ్రామాల యూత్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చైతన్య విజ్ఞప్తి చేశారు.

నీటి నిల్వలు తొలగించాలి



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్ల ఆవరణలో ఉన్న చిన్నపాటి నీటి నిల్వలు ఉండే నిరుపయోగ సామగ్రిని తొలగించుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని టి.వేమవరం, చాకలి చెరువు వార్డు సచివాలయాల ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వ పెట్టుకునే పాత్రలు, తొట్టిలపై విధిగా మూతలు ఉంచడం, మురుగునీరు నిల్వల్లో ఆయిల్ చల్లుకోవడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టవచ్చని, ప్రజలు వారానికి ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల నిర్మూలన చేయవచ్చని అన్నారు. ఈ చలి కాలంలో శీతలపానీయాలకు దూరంగా ఉండటం, వేడి నీటిని తాగడంచ జలుబు చేస్తే వేడినీటిని ఆవిరి పట్టడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.బేబీ కుమారి, బి.శిరీష, ఎస్.భానుశ్రీ,ఆశా కార్యకర్త ఇ.లలిత పాల్గొన్నారు.

రైతులు ఫసల్ బీమా చేయించుకోవాలి



నవాబుపాలెం ఆర్‌ఎస్‌కేలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు దాళ్వా పంటను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు చేయించుకోవాలని ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపాలెం, కృష్ణాయపాలెం, పడాల గ్రామాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు మీ–సేవా, కోఆపరేటివ్ సొసైటీలు, సచివాలయాల్లో ఈ నెల 31వ తేదిలోపు ఎకరానికి రూ.615లు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గతంలో మండలం యూనిట్‌గా ఉండేదని, ప్రస్తుతం గ్రామం యూనిట్‌గా బీమా పథకం వర్తింపజేస్తున్నట్టు తెలిపారు. ఎకరానికి రూ.41వేలు బీమా ఉంటుందన్నారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లు స్నేహ, ఆంజనేయులు, సన్ని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



తణుకులో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ సత్య ఉషారాణి

తణుకు అర్బన్: సాంకేతికంగా దినదినాభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శుక్రవారం గణిత, భౌతిక, రసాయన, గణాంక, కంప్యూటర్స్ విభాగాల ఆధ్వర్యంలో ఇగ్నైట్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంపిటీషన్స్‌లో పాల్గొనడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చని, పోటీల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 175, విద్యార్థినులు 360 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి తెలిపారు. అనంతరం క్విజ్, ఫన్‌స్టాట్, కోడింగ్ ఫజిల్‌తోపాటు 8 విభాగాల్లో గెలుపొందిన 24 మంది విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ హెడ్స్ కేవీ రామకృష్ణ, కె.పద్మజారాణి, ఎన్‌వీఎస్‌ఏ కుమార్, టి.భద్రకాళి, సీహెచ్ నాగరాజు, వీవీవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఉత్తమ అవార్డు



విజయవాడలో ఉత్తమ అవార్డు అందుకున్న డైరెక్టర్ వంక రవళి

తణుకు అర్బన్: రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఇంధన పొదుపు విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ అవార్డు దక్కింది. శుక్రవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్, ఎనర్జీ కన్సర్వేషన్ వెలడిక్టరీ ఫంక్షన్‌లో రవళి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లభించిన ఈ అవార్డును, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఫర్ ఎనర్జీ కె విజయానంద్ చేతులమీదుగా సంస్థ డైరెక్టర్ వంకా రవళి అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధరబాబు, ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్ రవి పట్టంశెట్టి, ఏపీఎస్‌పీసీఎల్ ఎం కమలాకర బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తణుకులో కార్గో మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. తక్కువ ఖర్చుతో అత్యంత భద్రంగా, అతి వేగంగా కార్గో సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా మాసోత్సవాలకు సబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబా, ఆఫీస్ సూపరిండెంట్ వెన్నా రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ కొత్తలంక శేఖర్, గారేజ్ ప్రసాద్, ఉద్యోగులు ములగాల వెంకటరత్నం, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొట్టుకు కృతజ్ఞతలు



మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అద్దంకి విజయరత్నం

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీ ఎస్సీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది అద్దంకి విజయరత్నం శుక్రవారం మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకికి మాజీ మంత్రి కొట్టు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టూడెంట్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు అరిగెల అభిషేక్, ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, తాతా శ్రీనివాస్, కర్రి భాస్కరరావు, గుండుమోగుల సాంబయ్య పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వంట నిర్వాహకులకు కనీస వేతనాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరిన్డి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ స్థానిక రామేశ్వరస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కలిప్పించాలని డిమాండ్ చేశారు. వంట నిమిత్తం గ్యాస్ ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చెయ్యాలని, ప్రతి విద్యార్థికి పెరుగుతున్న ధరల కనుగుణంగా రూ. 20అధనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల గ్రామాల్లో వంట కార్మికులకు పై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని వాటిని అరికట్టాలని ఉద్యోగ భద్రత కలిప్పించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కమిటీ సభ్యులు షేక్ ఫాదుషా, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, సీపీఎం మండల కార్యదర్శి మోహన్‌రావు, నేతలు బండి రంగారావు పాల్గొన్నారు.

29న కొండేపాడులో క్రిస్మస్ ఆరాధన

పెంటపాడు: ఈనెల 29న సాయంత్రం బి.కొండేపాడు సియోను మందిరంలో క్రిస్మస్ ఆరాధన నిర్వహించనున్నట్లు సంఘ కాపరులు ఎం సాల్మన్‌రాజు, కెజియాలు తెలిపారు. తణుకు కు చెందిన ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పరస మోజ స్ ప్రవీణ్ దేవుని సందేశం అందించి క్రిస్మస్ నిర్వహిస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తాడేపల్లిగూడెం (టీటీసీ): యోగాతోనే మానసిక ప్రశాంతం సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. ఈనెల 22న సహజ యోగ ఉచిత పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని బస్‌స్టాండ్ ఎదురుగా శ్రీ లలితా స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సహజ యోగ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ మణి, ఏపీ స్టేట్ కమిటీ సభ్యులు అప్పన హనుమంతరావులు పాల్గొంటారని నిర్వాహకులు కోరారు. ప్రశాంతమైన జీవితం కోసం సహజ యోగా, ధ్యానం ఎంతో అవసరమని, ఉచిత క్లాసలకు హాజరుకావాలని కోరారు.

22న కామ్రేడ్ ఐనపర్తి రాజగోపాల్ సంస్మరణ సభ

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కామ్రేడ్ ఐనపర్తి రాజగోపాల్ సంస్మరణ సభ ఈ నెల 22వ తేదీన తణుకులోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉదయం 9.30 గంటలకు జరగనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల, ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు యూ వెంకటేశ్వరరావు, ఎస్‌కే జిలాని, రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ ప్రజా సంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు హాజరవుతారని వెల్లడించారు. సభలో పాల్గొనాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



అత్తిలి: గుమ్మంపాడు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ



తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్ కుమార్

అత్తిలి: రెవెన్యూ సదస్సుల ద్వారా గతంలో పరిష్కారం కాని భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు తమ భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు అర్జీలను అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ వేగేశ్న ధన సత్యనారాయణరాజు, వీఆర్వో బేతు బాబులు పాల్గొన్నారు.

ఈనాం భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం!

తాడేపల్లిగూడెం రూరల్: ఈనాం భూముల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, పడాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కుంచనపల్లిలో జరిగిన సదస్సులో తహసీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో 400 ఎకరాలకుగాను 120 ఎకరాలకు ఆన్‌లైన్‌లో నమోదైన ట్లు తెలిపారు. మిగిలిన రైతులు ఏకతాటిపై దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ ఈవో ఆర్‌వీ.బ్రహ్మం, టీడీపీ నాయకుడు వాడపల్లి సుబ్బరాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి



తాడేపల్లిగూడెం రూరల్: ముగిసిన శిక్షణ కార్యక్రమం



ఇరగవరం: శిక్షణలో పాల్గొన్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల మహి ళా సమాఖ్య భవనంలో శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో గ్రామాల సుస్థిర అభివృద్ధికి ముందుకు సాగాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, సర్పంచ్‌లు మద్దుకూరి గంగాభవాని, కూడవల్లి హనుమంతు, తాడేపల్లి బేబి, బొనిగే పోతన, ములకాల సూర్యారావు, ఆరుగొలను శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

ఇరగవరం: మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా శుక్రవారం రెండోవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ 6 రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తి అయినట్లు తెలిపారు. పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్యం, శక్తి వనరులు, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ అందజేశారు. ఈ శిక్షణను విస్తరణాధికారి పీవీఎస్ నరసింహమూర్తి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోండి



దువ్వలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్న వ్యవసాయ అధికారి కుసుమ, రైతులు

తణుకు అర్బన్: నారుమడి దశలో ఉన్న రైతులంతా వర్షం నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తణుకు మండల వ్యవసాయాధికారి కె.కుసుమ అన్నారు. శుక్రవారం తణుకు మండలం దువ్వ గ్రామంలో రైతులకు పలు సూచనలు చేశారు. అల్పపీడనం దృష్ట్యా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కల్లంలో ఉన్న ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. నారుమడి కూడా తక్కువ విత్తనాలతో 16 రోజులలోపే ఊడ్పు అయిపోతుందని, దీనిద్వారా సమయం కూడా గంటకు ఎకరం ఊడ్పు చేయవచ్చని అదే సాధారణ పద్దతిలో అయితే ఒక్క పూటకిపైగా సమయం పడుతుందని వివరించారు. తణుకు మండలంలో సార్వాకి సంబంధించి 11267 ఎకరాలకుగాను 98 శాతం పంట కోతలు జరిగాయని, 20వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలుతో 86 శాతం జరిగినట్లు చెప్పారు. వ్యవసాయశాఖ సిబ్బంది కె.పుష్ప, డి.మల్లిఖార్జున, కె.అరుణ్‌తేజ, రైతులు పాల్గొన్నారు.